క్లుప్తంగా

ఉత్సాహంగా గ్యాడ్యుయేషన్ డే



పట్టాలు అందుకున్న చిన్నారులతో అతిథులు

పరవాడ: పి.బోనంగి గ్రామంలోని సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో కిండర్ గార్డెన్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. బ్రాండిక్స్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్) రాబర్ట్ పి.ఫర్గుసన్ మాట్లాడుతూ ఇలాంటి వేడుకలు పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఉపయోగపడతాయన్నారు. పాఠశాల డైరెక్టర్ పి.ఉదయ నాగశ్రీ మాట్లాడుతూ కిండర్ గార్డెన్ చిన్నారులు ఆట పాటలతో నేర్చుకొన్న విద్య వారి ప్రాథమిక విద్యకు తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు తొలగింపు



ఆక్రమణను తొలగించిన రెవెన్యూ అధికారులు

పరవాడ: మండలంలోని కలపాక రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 33/2 లో కొందరు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన కల్వర్టును శనివారం కలపాక వీఆర్వో భుజంగరావు ఆధ్వర్యంలో తొలగించారు. తమ జిరాయితీ స్థలంలోకి వెళ్లడానికి వీలుగా ఇక్కడ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కొందరు వ్యక్తులు పైప్పలతో కల్వర్టు నిర్మించారు. దీనిపై పలువురి నుంచి ఫిర్యాదులు అందాయి. తహసీల్దారు ప్రకాశరావు ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించామని వీఆర్వో భుజంగరావు చెప్పారు. ప్రభుత్వ భూములను ఆక్రమించడం చట్టరీత్యానేరమని అలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వీఆర్వో హెచ్చరించారు.

నేడు మండల వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం

పరవాడ: దేశాయిపాలెం క్యాంపు కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికలపై అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్టు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. మండలంలో ఎంపీటీసీలు, సర్పంచులు, ముఖ్య నాయకులు సమావేశానికి విధిగా హాజరు కావాలని కోన కోరారు.

పోర్ట్ పెన్షనర్ల ధర్నా రేపు

మల్కాపురం: పోర్టు ట్రస్ట్‌పై కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ చైర్మన్ సనపల బంగారురాజు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావుతో కలిసి ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మురళీనగర్, తెన్నేటినగర్, మాధవధార, కంచరగనగర్ తదితర ప్రాంతాల్లోని పింఛనుదారులను కలిసి కరపత్రాలు అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి పి.ఎస్.ప్రకాష్‌రావు, కోశాధికారి అన్నపు నారాయణరావు, కె.గణేష్, పి.రామారావు పాల్గొన్నారు.

అర్హులందరూ పెన్షన్‌కు దరఖాస్తు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

పెదగంట్యాడ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈపీఎస్–95కు దరఖాస్తు చేసుకోవాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ సూచించారు. నడుపూరులోని నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా పెన్షన్ వస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా పెన్షన్‌దారుల సందేహాలను నివృత్తి చేశారు. బెల్లాల నాగేశ్వరరావు, మురళీ రాజు, సంపూర్ణం తదితరులు పాల్గొన్నారు.

తుప్పల్లో పశువైద్య కేంద్రం



తుప్పల మధ్య ఉన్న పరవాడ పశువైద్య కేంద్రం

పరవాడ: స్థానిక పశు వైద్య కేంద్రం తుప్పల మాటున ఉండడంతో రైతులు పశువైద్య కేంద్రాన్ని గుర్తించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పశువైద్యశాల లోతట్టు ప్రదేశంలో నిర్మించారు. ఆపై ఆస్పత్రికి ఎదురుగా ఉన్న ప్రాంతం గోతులమయంగా ఉండడంతో తుప్పలు డొంకలు దట్టంగా పెరిగిపోయాయి. పశువులను వైద్యం కోసం తీసుకు వచ్చిన రైతులు పశువైద్య కేంద్రాన్ని ఓ పట్టాన గుర్తించలేక తర్జన భర్జన పడుతున్నారు. పశువైద్య కేంద్రం ఆచూకీ కోసం స్థానిక దుకాణదారులపై ఆధారపడుతున్నారు. పశువైద్య కేంద్రం కనిపించే విధంగా తుప్పలు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అప్పన్న ధ్వజ స్తంభ స్వర్ణతాపడం పనుల్లో కదలిక

రూ. కోటితో పనులకు సీఎంఆర్ అధినేత సంసిద్ధత



ధ్వజస్తంభాన్ని పరిశీలిస్తున్న సీఎంఆర్ ప్రతినిధి చంద్రశేఖర్ ఆజాద్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ధ్వజస్తంభం స్వర్ణతాపడం పనుల్లో కదలిక వచ్చింది. కోటి రూపాయల వ్యయంతో ధ్వజస్తంభాన్ని స్వర్ణమయం చేసేందుకు నగరంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకటరమణ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎంఆర్ ప్రతినిధి చంద్రశేఖర్ ఆజాద్ శనివారం సింహగిరికి వచ్చి ధ్వజస్తంభాన్ని పరిశీలించారు. ప్రస్తుతం రాగి రేకులతో ఉన్న ధ్వజస్తంభాన్ని స్వర్ణమయం చేసేందుకు (రాగిరేకులపై బంగారుకోటింగ్ వేసేందుకు) గతేడాది సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ సంకల్పించారు. ఈమేరకు రూ.85లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఎస్ఎఫ్‌టీకి 2.25గ్రాముల బంగారం వెచ్చించే విధంగా ప్రతిపాదనలు రూపొందించారు. ఆ అంచాలను రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కి అప్పట్లో పంపించారు. మరింత ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి పకడ్బందీగా స్వర్ణమయం పనులు జరగాలని కమిషనర్ సూచించారు. దీంతో కోటి రూపాయలతో ధ్వజస్తంభం పనులు చేయాలని సీఎంఆర్ అధినేత ముందుకు వచ్చారద్దా మేరకు శనివారం సీఎంఆర్ ప్రతినిధి చంద్రశేఖర్ ఆజాద్, దేవస్థానం ఏఈ రాంబాబు, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులతో కలిసి ధ్వజస్తంభాన్ని పరిశీలించారు. సంబంధిత ఎస్టిమేట్‌ను దేవదాయశాఖ కమిషనర్‌కు పంపించనున్నారు. అక్కడ నుంచి ఆమోదం రాగానే పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో ప్రతిభ వెలుగులోకి



ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడు తదితరులు



గాలిభీమవరంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సీఐ రంగనాథం

సబ్బవరం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని ఎంపీడీవో రమేష్ నాయుడు అన్నారు. స్థానిక ఆర్కిడ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడి వారు ఏర్పాటు చేసిన ప్రాజక్టుల వల్ల కలిగే ఉపయోగాలు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసేలా చూడాలని ఎంఈవో అప్పలరాజుకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

- గాలిభీమవరంలోని ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో ఆర్యా పాలీ టెస్ట్–2023 కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సైన్స్ ఎక్స్‌పో, క్రీడా పోటీలు నిర్వహించారు. సీఐ రంగనాథం, ఎంఈవో అప్పలరాజు క్రీడా పోటీలను ప్రారంభించారు.

నగర సుందరీకరణకు ప్రాధాన్యం



సుందరీకరణ పనులపై అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: వచ్చే నెలలో జరగనున్న రెండు అంతర్జాతీయ సదస్సులకు నగరంలో సుందరీకరణ పనులకు ప్రాధాన్యంఇస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం ఎన్ఏడీ జంక్షన్ నుంచి మురళీనగర్, తాటిచెట్లపాలెం జంక్షన్ జాతీయ రహదారి వరకు అధికారులతో కలిసి పర్యటించారు. రహదారికి ఆనుకుని ఉన్న ప్రాంతాలు తెలిపే సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రహదారికిరువైపులా పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించాలని, చెట్లు, ఎలక్ట్రికల్ పోల్స్, గోడలకు ఉన్న ప్రకటన బోర్డులు, కేబులు వైర్లు, పోస్టర్లు తొలగించి శుభ్రం చేయించాలని అధికారులకు సూచించామన్నారు. బస్టాప్‌లు ఆధునీకరించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న మొక్కలకి ట్రి కలర్ వేయాలని ఆదేశించారు. ప్రతిరోడ్డు క్రాసింగ్ వద్ద జీబ్రాలైన్స్ వేసి స్టడ్ లైటింగ్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. జీ–20 సదస్సుకు 20 దేశాల ప్రతినిధులు రానున్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికులను ఆయా ప్రాంతాల్లో ఉంచి, రోడ్డును నిరంతరం శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు, పట్టణ ప్రణాళికాధికారి బి. సురేష్‌కుమార్, హార్టీకల్చర్ డీడీ దామోదరరావు, జోనల్ కమిషనర్లు మల్లయ్య నాయుడు, ఆర్‌జీవీ కృష్ణ, పర్యవేక్షక ఇంజినీర్లు వేణుగోపాలరావు, రామ్మోహనరావు, డీసీపీ సంజయ్, ఏసీపీ, ఏఎంహెచ్‌వో పాల్గొన్నారు.

పరదేశిమాంబ పండగకు విస్తృత ఏర్పాట్లు

- పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసరావు
- 28న ప్రధాన పండగ



ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెంలో పరదేశిమాంబ పండగను వైభవంగా నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడలతో పాటు పలు పోటీలు నిర్వహిస్తున్నారు. 28న పరదేశిమాంబ ప్రధాన పండగ జరగనుంది.దీనిలో భాగంగా సినీ తారలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మరోవైపు పెద్ద ఎత్తున జనం పండగకు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో శనివారం డీఎస్పీ శ్రీనివాసరావు గ్రామంలో పర్యటించారు. పలు సూచనలు చేశారు.ఆయనతో పాటు సీఐ రంగనాథం, ఎస్ఐ ఎల్. సురేష్ ,సర్పంచ్ బోకం స్వామినాయుడు, బోకం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

పండగ సందర్భంగా శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను ఎంపీపీ బోకం సూర్యకుమారి ప్రారంభించారు. విజేతలకు ఉత్సవాల ముగింపు రోజున నగదు బహుమతులు అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తవ్వవానిపాలెం, అమృతపురం, చింతగట్ల సర్పంచ్‌లు బోకం స్వామినాయుడు, బైలపూడి గౌరి, గనిశెట్టి వెంకటలక్ష్మి, రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ బోకం అప్పలనాయుడు, మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ బోకం కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

అల్లిపురం : దేశంలో ప్రధాన ఓడరేవుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డీకే శర్మ కేంద్ర షిప్పింగ్ కార్యదర్శి సుదాంష్ పంత్‌ను శనివారం కలసి వినతిపత్రం అందజేశారు. అన్ని పోర్టులతో పాటు విశాఖ పోర్టులోను బోర్డు మెంబర్ల నియామకం జరగలేదని, తక్షణమే బోర్డు మెంబర్ల నియామకం చేపట్టాలని కోరారు.

ఇగ్నో ప్రవేశాలకు 28వ తేదీ తుది గడువు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023 జనవరి విద్యాసంవత్సరానికిగాను ప్రవేశాల గడువు ఈ నెల 28తో ముగియనుంది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు వివరాలు వెల్లడించారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రవేశాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ కల్పిస్తున్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీకాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలి.

రేపటి నుంచి యోగా శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రా విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి జనరల్ యోగా తరగతులను ప్రారంభిస్తున్నట్లు కేంద్రం విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తరగతులు జరుగుతాయని, ఆసక్తి ఉన్న వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మార్చి 1 నుంచి స్థూలకాయ నివారణ శిబిరం

ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్ర ఆధ్వర్యంలో మార్చి 1 నుంచి స్థూలకాయ నివారణ ప్రత్యేక యోగా శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు భాను కుమార్ తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 83743 57324లో సంప్రదించాలని సూచించారు.

744వ రోజుకు ఉక్కు దీక్షలు



దీక్షలో పాల్గొన్న ట్రాఫిక్, కన్‌స్ట్రక్షన్, ఆర్ఎండీ విభాగ ఉద్యోగులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం జంక్షన్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 744వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో స్టీల్ ప్లాంట్ ట్రాఫిక్, కన్‌స్ట్రక్షన్, ఆర్ఎండీ డిపార్టుమెంటు ఉద్యోగులు కూర్చున్నారు. వారు మాట్లాడుతూ ప్లాంట్ పరిరక్షణ కోసం ఎంతటి పోరాటాకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. అందరి సహకారంతో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5.30 గంటలకు సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

టెన్త్ పరీక్షలకు సన్నద్ధం కండి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న పరీక్షల కో ఆర్డినేటర్ ప్రసాద్

గోపాలపట్నం: పదో తరగతి పరీక్షల్లో పదికి పది జీపీఏ సాధించేందుకు సన్నద్ధం కావాలని పరీక్షల విభాగం జిల్లా కో ఆర్డినేటర్ ప్రసాద్ సూచించారు. మేహాద్రి గెడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యా బోధన ఏవిధంగా జరుగుతుందో విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలో వివరించారు. తనలో ఉన్న బలహీనతలను గుర్తించి వాటిని అధిగమించాలని, అప్పుడే విజయం సాధిస్తామన్నారు. పరీక్ష సమయంలో ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, పోషకాహార లోపాలు, రక్త హీనత వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.మృదుల ప్రియదర్శిని, వైస్ ప్రిన్సిపాల్ బి.రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



గరుడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడ సేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణమండపంలోని గరుడవాహనంపై వేంచేయజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ అనంతరం హారతులు అందజేశారు. భక్తులను గరుడవాహన చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

వర్సిటీ భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు
- 10 సెంట్ల విస్తీర్ణంలో తవ్వినట్టు గుర్తింపు



వంగలిలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీటీ వెంకట్ తదితరులు

సబ్బవరం: వంగలిలో పెట్రోయూనివర్సిటీకి కేటాయించిన భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. గ్రావెల్ తరలిస్తూ పట్టుబడిన లారీని స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ సిబ్బందితో కలిసి శనివారం గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన భూములను పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. వర్సిటీకి కేటాయించిన భూముల్లోని సుమారు 10 సెంట్ల స్థలంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపట్టినట్లు గుర్తించామన్నారు. అక్కడ నుంచి సుమారు 50 లారీల వరకు గ్రావెల్ అక్రమంగా తరలించినట్లు అంచనా వేశామన్నారు. శనివారం వేకువజామున వర్సిటీ స్థలంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టినట్లు స్థానికులు వర్సిటీ రిజిస్ట్రార్ మురళీ కృష్ణకు సమాచారం అందించారన్నారు. దీంతో ఆయన జిల్లా కలెక్టర్‌తో పాటు సీఐ రంగనాథంకు విషయం తెలియజేశారని చెప్పారు. దీనితో ఆర్డీవో ఆదేశాల మేరకు క్షేత్ర పరిశీలన చేసినట్టు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. పోలీసులు పట్టుకున్న లారీని మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. క్షేత్ర పరిశీలన చేసినవారిలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష్,మండల సర్వేయర్ శ్రీనివాసరావు,ఆర్ఐ వీరయ్య, వీఆర్వో మూర్తి తదితరులు ఉన్నారు.

వృద్ధి అజెండాలో భారత్ ప్రగతి



గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సదస్సులో మాట్లాడుతున్న ప్రతినిధులు

ఆరిలోవ : వృద్ధి అజెండాలో భారతదేశం అగ్రగామిగా నిలవడానికి సిద్ధంగా ఉందని హైదరాబాద్‌కు చెందిన ఈఅండ్‌వై మేనేజింగ్ పార్టనర్ జయేష్ సంఘ్వీ తెలిపారు. నగరంలో ఓ హోటల్‌లో శనివారం జరిగిన గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సీఐఐ విశాఖపట్నం జోన్ వార్షిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రపంచీకరణ, అవకాశాలలో అభివృద్ధి చెందుతున్న ధోరణలు అనే అంశంపై మాట్లాడారు. డిజిటలైజేషన్ ఎకో సిస్టంను అందించిందన్నారు. దీంతో పాటు ఫార్మలైజేషన్ గవర్నెన్స్ సమస్యను పరిష్కరిస్తూ కొత్త వ్యాపార ఉత్పత్తుల సేవలను పెంపొందించిందన్నారు. దీనివల్ల సమర్థత, పోటీతత్వం పెరుగుతాయన్నారు. ఇది దేశంలో పెట్టుబడులను పెంపొందించడానికి సహాయపడుతుందన్నారు. ఉత్పత్తులు తయారీ, మౌలిక సదుపాయాల కల్పనలో భారతదేశం ముందుందన్నారు. ఇన్ఫోసిస్ లిమిటెడ్ డెలివరీ హెడ్ నర్రా సురేష్ మాట్లాడుతూ ఐటీ ల్యాండ్ స్కేప్‌లో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ప్రాబ్లం సాల్వర్ నుంచి ప్రాబ్లం ఐడింటిఫియర్ వరకు లోపం ఎక్కడ ఉందో అంచనా వేయలేకపోతున్నామన్నారు. ఇది పెద్ద సవాల్‌గా మారిందన్నారు.

సీఐఐ విశాఖ జోన్‌కు కొత్త ఆఫీస్ బేరర్లు..

కాన్ఫెరెన్స్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) విశాఖ జోన్‌కు కొత్త ఆఫీస్ బేరర్లను ఈ సమావేశంలో నియమించారు. సీఐఐ 2023–24 నూతన చైర్మన్‌గా విశాఖ ఫ్మాసిటీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈవో డాక్టర్ పి.పి. లాల్‌ను నియమించారు. వైస్ చైర్మన్‌గా ఇంటిగ్రిల్ ట్రేడింగ్ అండ్ లాజిస్టిక్ మేనేజింగ్ పార్టనర్ గ్రంధి రాజేష్‌తో పాటు మరికొందరు సభ్యులను నియమించారు.

కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ఉన్నతికి సహకారం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్).. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్(ఎన్‌బీఏ) పొందేందుకు అవసరమైన సహకారం అందిస్తామని కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం(కెమ్‌దోసా) ప్రకటించింది. కళాశాలలో కెమ్‌దోసా అధ్యక్షుడు ఎ.వరహాలు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ప్రాంగణంలో పచ్చదనం అభివృద్ధికి రూ.50,000 విరాళాన్ని ప్రకటించారు. ప్రతిభావంతులకు నగదు బహుమతులు ఇచ్చేందుకు ప్రతి ఏడాది రూ.70,000 కేటాయిస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ కెమ్‌దోసా సభ్యులు కాలేజీ అభివృద్ధికి చేస్తున్న సహకారం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేముడు, కెమ్‌దోసా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ధ్యానంతోనే ప్రపంచ శాంతి



సిల్వర్ జూబ్లీ వేడుకల్లో మాట్లాడుతున్న రాజు భాయ్

కూర్మన్నపాలెం: ప్రపంచ శాంతి కోసం ధ్యానం చేయాలని మౌంట్ అబుకు చెందిన రాజయోగి రాజుభాయ్.జి అన్నారు. కూర్మన్నపాలెంలోని బ్రహ్మకుమారీ సంస్థను స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు ధ్యానం దోహదం చేస్తుందని చెప్పారు. ఇక్కడి కార్యాలయంలో ఉచితంగా ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూర్యనారాయణ భాయ్.జి, శశికళ, రమణి తదితరులు పాల్గొన్నారు.